క్లుప్తంగా

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ విక్రాంత్

భద్రాచలంటౌన్: పట్టణ ఆటో డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో మోటార్ వెహికల్ యాక్ట్ రూల్స్ ప్రకారం నిబంధనలు సక్రమంగా పాటించాలని భద్రాచలం అసిస్టెంట్ ఎస్పీ విక్రాంత్ ఆదేశించారు. స్థానిక ఏఎస్పీ కార్యాలయంలో పట్టణంలో ఆటో డ్రైవర్లకు మంగళవారం ఆయన రోడ్డు భద్రత నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని సూచించారు. అధికంగా చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, మద్యం సేవించి ఆటోలు నడిపితే డ్రైవింగ్ లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భద్రాచలం ట్రాఫిక్ ఎస్‌ఐ మధు ప్రసాద్, ట్రాఫిక్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఆక్రమిస్తే చర్యలు

పినపాక: రోడ్లకు ఇరువైపులా ఆక్రమించి ఫ్లెక్సీలు, తోపుడు బండ్లు వంటివి ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఈ బయ్యారం ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు. మంగళవారం బయ్యారం క్రాస్ రోడ్‌లో రోడ్డుపై ఏర్పాటు చేసిన దుకాణాల ఫ్లెక్సీలు, తోపుడు బండ్లను తొలగించారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు బయ్యారం క్రాస్ రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుండగా.. రోడ్లు విశాలంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

బూర్గంపాడు: సారపాక ఐటీసీ పీఎస్‌పీడీలో ఐఎన్‌టీయూసీ క్యాలెండర్‌ను యూనిట్‌హెడ్ శైలేంద్రసింగ్ ఆవిష్కరించారు. మంగళవారం ఐటీసీ అడ్మిన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారం వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఐటీసీ యజమాన్యం పరిశ్రమ విస్తరణలో భాగంగా 8వ ప్లాంట్‌ను ఇక్కడే ప్రారంభించాలని కోరారు. ఐటీసీ పీఎస్‌పీడీ జనరల్ మేనేజర్ శ్యామ్‌కిరణ్, ఐఎన్‌టీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొనె రామారావు, యారం పిచ్చిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ రాంగోపాల్

మణుగూరుటౌన్: ఏఐటీయూసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం బ్రాంచ్ సెక్రటరీ వై.రాంగోపాల్ అన్నారు. మంగళవారం ఏరియా వర్క్‌షాప్, స్టోర్స్‌లలో ఫిట్ సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఏఐటీయూసీ డిమాండ్ మేరకు స్ట్రక్చర్ సమావేశాలు యాజమాన్యం హైదరాబాద్‌లో ఏర్పాటు.. పెరాక్స్‌పై ఇన్‌కం టాక్స్ చెల్లింపు, సొంత ఇంటి పథకం కింద 250 గజాల స్థలం వంటి దాదాపు 14 అంశాలపై యాజమాన్యంతో చర్చలు జరిపి సఫలీకృతం అయ్యామని తెలిపారు. సమావేశంలో మల్లెల రామనర్సయ్య, మేకల ఈశ్వర్‌రావు, ఆవుల నాగరాజు, గోలి గంగాధర్‌రావు, ఆదర్ల సురేందర్, చారి, రాకేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై కళాజాతా

బూర్గంపాడు: లక్ష్మీపురంలోని లారీయార్డు వద్ద, మోరంపల్లిబంజర ప్రధానకూడలిలో హెచ్‌ఐవీ నివారణపై మంగళవారం కళాజాతా ప్రదర్శనలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ పర్యవేక్షణలో వైఆర్‌జీకేర్ లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో పోలూరు రాము కళాబృందం ఆధ్వర్యంలో పల్లెసుద్దులు కళాజాతా ప్రదర్శనలు నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించారు.

ఫేర్‌వెల్ డే వేడుకలు

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారం గ్రామంలో ఉన్న శ్రీవిజ్ఞాన్ పాఠశాలలో ఫేర్‌వెల్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ దొడ్డి భద్రయ్య, శ్రీవిద్య విద్యాసంస్థల అధినేత టి విజయభాస్కర్‌రెడ్డి, శ్రీవిద్య కృష్ణవేణి టెక్నో కళాశాల కరస్పాండెంట్ పుచ్చకాయల శంకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో శ్రీవిజ్ఞాన్ పాఠశాల కరస్పాండెంట్ సాంబశివరెడ్డి, ప్రిన్సిపల్ రత్నకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రికి సుస్తీ

వంద పడకల ఆస్పత్రిలో అందని పూర్తిస్థాయి వైద్యం

- వేధిస్తున్న వైద్యుల కొరత
- రిఫర్‌తోనే సరిపెట్టుకుంటున్న వైనం
- కనీస వసతులు సైతం కరువు



మణుగూరు 100 పడకల ఆస్పత్రి

మణుగూరుటౌన్: మణుగూరు వంద పడకల ఆస్పత్రిలో పూర్తి స్థాయి వైద్యం అందక ఏజెన్సీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పినపాక నియోజకవర్గ మండల కేంద్రానికి ఏకైక దిక్కుగా ఉన్న ఆస్పత్రిలో వైద్యుల కొరత వేధిస్తుండటంతో రోగులకు క్రమక్రమంగా ప్రధాన ఆస్పత్రి ప్రథమ చికిత్స కేంద్రంగా మారుతోందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. చిన్నప్రమాదం జరిగిన భద్రాచలం తరలింపు, జ్వరం, తొలి దశలో ఉన్న పాయిజన్ కేసులను మినహా ఎక్స్‌రే వంటి సౌకర్యాలు లేక వైద్యులు రోగులకు వైద్యం చేయలేని పరిస్థితి నెలకొంది.

సమస్యలు నివేదించాం..



వంద పడకల ఆస్పత్రిలో నెలకొన్న వైద్యుల కొరత, సిబ్బంది కొరత, కావాల్సిన సదుపాయాలపై స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్ దృష్టికి తీసుకెళ్లాను. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. వీలైనంత త్వరగా పరిష్కారమవుతాయని ఆశిస్తున్నాం.

– సునీల్ మజ్జేకర్, సూపరింటెండెంట్

వైద్యుల కొరత..

సబ్‌డివిజన్‌లో శివారు ప్రాంతమైన దుగినేపల్లి, కరకగూడెం మండలం, పినపాక, అశ్వాపురం, మణుగూరుతో పాటు సమీప ఆదివాసీ గ్రామాలకు ఆరోగ్య సమస్య వస్తే పెద్దదిక్కుగా ఉన్న 100 పడకల ఆస్పత్రిలో మొత్తం 23 మంది వైద్యులతో సేవలు అందించాల్సి ఉంది. కానీ రెండేళ్లుగా 6–7 ఎంబీబీఎస్‌లు, మత్తు డాక్టర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా ఒక గైనకాలజిస్ట్ బాధ్యతలు స్వీకరించారు. రోజుకు 400–500 మంది ఓపీ ఉంటుండగా, సీజనల్ కాలాల్లో అది మరింత పెరిగి వైద్యులపై పని ఒత్తిడి పెరుగుతోంది. పిడియాట్రీషియన్, చెవి ముక్కు, దంత, ఎముకల తదితర విభాగాలకు వైద్యులు లేక పేదలు, ప్రజలు ప్రైవేట్ వైద్యశాలలను ఆశ్రయించి జేబులు గుల్ల చేసుకుంటున్నారు.

రెండేళ్లుగా భద్రాచలానికే..

ఆస్పత్రిలో పూర్తిస్థాయి వైద్యులు, కావాల్సిన సదుపాయాలు లేక తప్పక భద్రాచలం రిఫర్‌లు చేసేస్తున్నారు. ఒక వైపు వైద్యుల కొరత వేధిస్తున్నప్పటికీ మరోవైపు ఐసీయూ లేక అత్యవసరమైన కేసుల పరిస్థితిని ముందుగానే గుర్తించి నేరుగా భద్రాచలం తరలించే పరిస్థితి నెలకొంది. పోస్టుమార్టం గది విస్తరించాల్సిన ఆవశ్యకత ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి 100 పడకల ఆస్పత్రిలో పూర్తిస్థాయి వైద్యం అందేలా కృషి చేయాలని కోరుతున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



పినపాక: మిర్చి కాలిపోయి నష్టపోయిన రైతును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

అశ్వాపురం: పినపాక నియోజకవర్గానికి మొదటి విడతలో మంజూరు 3,500 ఇళ్లు మంజూరు కాగా.. వాటిని అర్హులైన నిరుపేదలకే కేటాయిస్తామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. తుమ్మలచెరువు గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా మంగళవారం సోందె సావిత్రమ్మ ఇంటికి పినపాక ఎమ్మెల్యే పాయం భూమి పూజ చేశారు. అనంతరం అన్ని శాఖల ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పైలట్ ప్రాజెక్ట్‌గా గిరిజన గ్రామమైన తుమ్మలచెరువులో 242 లబ్ధిదారులను ఎంపిక చేశారని తెలిపారు. గ్రామంలో పలు కుటుంబాలను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, ఎంపీఓ ముత్యాలరావు, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వంకా సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, అధికారులు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలి..


పినపాక: ఇటీవల మండల పరిధిలోని వెంకటరావుపేట గ్రామంలో మిర్చి కల్లాలకు నిప్పంటించిన నిందితులను కఠినంగా శిక్షించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పోలీసులను ఆదేశించారు. మంగళవారం సంఘటన జరిగిన ప్రాంతానికి చేరుకుని మిర్చిని పరిశీలించారు. రైతు పురుషోత్తం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ప్రభుత్వం, పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఇలాంటివి పునరావతం కాకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ స్కూల్‌తో ఉత్తమ బోధన

మణుగూరుటౌన్: పినపాక నియోజవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌తో ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా బోధన అందనుందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వెల్లడించారు. పాఠశాలను మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మణుగూరులోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల నిర్మాణానికి ఇటీవల రూ.200 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు పీరినాకి నవీన్, శివ, నాయకులు కూరపాటి సౌజన్య, సామా శ్రీనివాసరెడ్డి, రహీం, రాజు, పాతూరి వెంకన్న, కూచిపూడి బాబు, గాండ్ల సురేశ్ తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చర్ల: లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

చర్ల: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 23 మంది లబ్ధిదారులకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం అనంతరం సమావేశం ఏర్పాటు చేయగా.. ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఈదయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వరలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీను, సహకార సంఘ అధ్యక్షుడు పరుచూరి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన..

భద్రాచలంటౌన్: పట్టణంలోని స్థానిక లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు నాణ్యత లోపం లేకుండా నిర్మాణం జరిగే విధంగా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ నారాయణ పాల్గొన్నారు.

సీతారామతో చెరువులు నింపాలి

భద్రాచలంటౌన్: సీతారామ ప్రాజెక్టు నీళ్లతో జిల్లాలోని అన్ని చెరువులు నింపిన తర్వాతనే ఖమ్మం జిల్లాకు తీసుకువెళ్లాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎంబి.నర్సారెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన పట్టణ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాకు అన్యాయం చేసి ఖమ్మం జిల్లాకు నీళ్ళు తీసుకెళ్తాము అంటే చూస్తూ ఊరికినేది లేదన్నారు. లేని పక్షంలో రైతాంగాన్ని ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమానికి సిద్ధం అవుతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో గద్దం స్వామి, బండారు శరత్ బాబు, వెంకట రామారావు, పి.సంతోష్ కుమార్, లక్ష్మి, లీలావతి, జీవనజ్యోతి, రమేష్, అజయ్ కుమార్, భూపేంద్ర, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోరు నిర్మాణం అడ్డగింత



బోరు వాహనాన్ని అడ్డగించి రహదారిపై ధర్నా చేస్తున్న గిరిజనులు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని రామన్నగూడెం సమీపంలో ఉన్న టేకు ప్లాంటేషన్‌లో మంగళవారం అటవీ శాఖ అధికారులు బోరు నిర్మాణాన్ని చేపట్టగా.. పనులను స్థానిక గిరిజనులు అడ్డుకున్నారు. కాగా, గత కొన్నేళ్లుగా ప్లాంటేషన్ భూములపై అటవీశాఖకు, గిరిజనులకు మధ్య వివాదం నడుస్తోంది. ఈ క్రమంలోనే గిరిజనులు గతంలో హైకోర్టును ఆశ్రయించడంతో స్టేటస్ కో ఆర్డర్ వచ్చింది. కానీ న్యాయస్థానం ఉత్తర్వులను అటవీ శాఖ అధికారులు బేఖాతర్ చేస్తూ, బోరు నిర్మాణాన్ని చేపట్టడంతో వారంతా ప్లాంటేషన్ వద్దకు వచ్చి నిలుపుదల చేశారు. దాంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరగ్గా, ఆగ్రహించిన గిరిజనులు ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. విషయం తెలుసుకున్న స్థానిక అదనపు ఎస్సై రామ్మూర్తి ప్లాంటేషన్ వద్దకు వెళ్లి ధర్నా చేస్తున్న గిరిజనులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎస్సైకు హైకోర్టు ఆర్డర్, భూముల హక్కు పత్రాలను చూపించడంతో ఆయన రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లాలని సూచించగా ధర్నా విరమించారు. అనంతరం గిరిజనులు స్థానిక తహసీల్దార్ కృష్ణ ప్రసాద్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించి, సంబంధిత పత్రాలను అందించారు. పరిశీలించిన తహసీల్దార్ బోరు నిర్మాణాన్ని నిలిపివేయాలని అటవీశాఖ అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత ప్లాంటేషన్ వద్ద ఉన్న బోరు వాహనాన్ని స్థానిక ఆర్ఐ కృష్ణ ఆధ్వర్యంలో సీజ్ చేసి కార్యాలయానికి తరలించారు.

సీసీ రోడ్లకు శంకుస్థాపన

దమ్మపేట: మండలంలోని పలు గ్రామాల పరిధిలో రూ.కోటి 49లక్షల 20వేల వ్యయంతో మంజూరైన సీసీ రోడ్లకు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. మంగళవారం మండల పరిధిలోని జమేదారుబంజర, పార్కులగండి, బాలరాజుగూడెం, జగ్గారం, అంకంపాలెం ఆర్లపెంట, పూసుకుంట గ్రామాల్లో ఎమ్మెల్యే జారే సుడిగాలి పర్యటన చేశారు. పర్యటనలో సీసీ రోడ్లకు శంకుస్థాపనతో పాటుగా, పలువురిని పరామర్శించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, మండల కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వితరణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం కూనవరం రోడ్డులోని మానవసేవ వృద్ధాశ్రమానికి ఓ దాత క్వింటా బియ్యం వితరణగా మంగళవారం అందజేశారు. పట్టణానికి చెందిన ప్రముఖుడు సంకా రాంజేంద్ర ప్రసాద్ పుట్టిన రోజు సందర్భంగా టౌన్ మర్చంట్ సంఘం అధ్యక్షుడు కంభంపాటి సురేష్ ఆధ్వర్యంలో ఆశ్రమానికి క్వింటా బియ్యంతో పాటు వృద్ధులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు సరోజిని, బిర్రు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎక్స్‌పో వేడుకలు

మణుగూరురూరల్: మండలంలోని సంతోష్‌నగర్ ఉన్న ఎక్సలెంట్ స్టార్ హైస్కూల్‌లో మంగళవారం సైన్స్ ఎక్స్ పో–2025 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మణుగూరు ఎంఈఓ స్వర్ణజ్యోతి హాజరై ప్రారంభించారు. ఎక్స్‌పోలో విద్యార్థులు వివిధ విభాగాల్లో నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. ఎంఈఓ స్వర్ణజ్యోతి తిలకించి పరిశీలించారు. విద్యాసంస్థల చైర్మన్ ఎండి.యూసఫ్ షరీఫ్, కరస్పాండెంట్ ఎండి.ఖాదర్, డైరెక్టర్ యాకుబ్ షరీఫ్, నయ్యర్, జీనత్, సమీన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి బీఎస్పీ సమీక్షలు

చర్ల: జిల్లాలోని పినపాక, ఇల్లెందు, కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో నిర్వహించనున్న పార్టీ సమీక్ష సమావేశాలకు ఆయా నియోజకవర్గాల్లోని నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ తడికల శివకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 12న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పినపాక, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు ఇల్లెందు, 13న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొత్తగూడెం, సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రాల్లో ఈ సమీక్ష నిర్వహించనున్నట్లు, భవిష్యత్‌లో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

భట్టిపై విమర్శలు సరికాదు

అశ్వాపురం: రాష్ట్ర దళిత ఉప ముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్లు భట్టి విక్రమార్కను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధు అసభ్య పదజాలంతో, అహంపూరిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీపై, భట్టి విక్రమార్కను విమర్శించే స్థాయి తాతా మధుకు లేదని అన్నారు. ఆయన మాటలు వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

శాశ్వత ఉద్యోగం ఇవ్వాల్సిందే..

- గ్రామసభలో సింగరేణి ఓసీ నిర్వాసితులు
- అధికారుల తిరస్కరణతో సభ నుంచి నిష్క్రమణ



గ్రామసభలో ప్రత్యేకాధికారిని ప్రశ్నిస్తున్న స్థానికులు

మణుగూరుటౌన్: సింగరేణి యాజమాన్యం మణుగూరు ఓసీ విస్తరణ కోసం కళ్లజోళ్లు, వాటర్‌ప్లాంట్ మాత్రమే ఏర్పాటు చేసి సవతితల్లి ప్రేమ చూపుతోందని, భూ సేకరణ చట్టం ప్రకారం శాశ్వత ఉద్యోగం కల్పించి, మణుగూరు పట్టణం మాదిరిగానే భూ విలువ నిర్ధారించి, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని తిర్లాపురం గ్రామస్తులు పెసా గ్రామసభలో డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామంలోని రైతువేదికలో మణుగూరు ఓసీ విస్తరణలో భాగంగా పెసా గ్రామసభను ఏర్పాటు చేసి గ్రామస్తుల అభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా సభలో అధికారుల ముందు గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే తమ భూములు ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చేశారు. ప్రత్యేకాధికారి సుమా కలుగజేసుకుని.. భూ సేకరణ 2013 చట్టం ప్రకారం గిరిజనులకు ఆర్‌అండ్‌ఆర్, ఎకరానికి రూ.13లక్షలు, గిరిజనేతరులకు రూ.6.5 లక్షలు అందిస్తామని, చట్టంలో పర్మినెంట్ ఉద్యోగం చెప్పలేదని అన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగం కల్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని వివరించారు. గ్రామసభలో ఆమోదం తెలపాలని ఈ సందర్భంగా తహసీల్దార్ రాఘవరెడ్డి కోరారు. అసంతృప్తికి గురైన స్థానికులు.. మీ ఉద్యోగం అవసరం లేదంటూ.. తమ భూముల పైనే ఆధారపడి జీవిస్తామంటూ గ్రామసభను తిరస్కరించి వెనుదిరిగారు. ఈ సమావేశంలో జీఎం దుర్గం రాంచందర్, తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పీకేఓసీ పీఓ లక్ష్మీపతిగౌడ్, మణుగూరు ఓసీ పీఓ శ్రీనివాసచారి, సింగరేణి అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన కెరీర్ గైడెన్స్ శిక్షణ



విద్యార్థినికి సర్టిఫికెట్ అందిస్తున్న ట్రెయినర్ వెంకట్‌రామన్

అశ్వారావుపేటరూరల్: స్థానిక ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాలలో విద్యార్థులకు గడిచిన రెండు రోజులుగా నిర్వహిస్తున్న కెరీర్ గైడెన్స్ శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ శిక్షణ కార్యక్రమాన్ని గోద్రేజ్–ఆగ్రోవేట్, పసిడి పంట ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడో సంవత్సరం వ్యవసాయ విద్యార్థులకు నిర్వహించారు. ఇందులో భాగంగా క్యాంపస్ ఇంటర్వ్యూలు, గ్రూప్ సంభాషణలు, వ్యక్తిగత ఇంటర్వ్యూలు, ఉద్యోగాలకు సిద్ధం కావాల్సిన పద్ధతుల గురించి వివరించారు. అనంతరం శిక్షణకు హాజరైన విద్యార్థులకు శిక్షణకు సంబంధించిన సర్టిఫికెట్లను సంస్థ ట్రైనర్ వెంకట్‌రామన్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్, డాక్టర్ శ్రావణ్ కుమార్, డాక్టర్ శ్రీలత, డాక్టర్ శిరీష, డాక్టర్ కృష్ణతేజ పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ



అశ్వారావుపేటరూరల్: విద్యార్థులకు ప్యాడ్లు అందిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

దమ్మపేట: మండలంలోని మందలపల్లి, ముష్టిబండ జెడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు, న్యాయవాద దంపతులు గొంది మురళీమోహన్, సంధ్యారాణి మంగళవారం పరీక్ష ప్యాడ్లు, జామెంట్రీ బాక్సులు, పెన్నులను వితరణగా అందజేశారు. ప్రశాంతంగా పరీక్షలు రాసి, ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్యాయవాది గోళ్ళ భవాని కృష్ణ, పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

అశ్వారావుపేటరూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలను విద్యార్థులు ఏలాంటి ఒత్తిడి, ఆందోళన లేకుండా పరీక్షలు రాయాలని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, లయన్స్‌క్లబ్ జిల్లా బాధ్యుడు యూఎస్ ప్రకాశరావు సూచించారు. మంగళవారం అశ్వారావుపేటలోని జవహర్ విద్యాలయంతోపాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న సుమారు 200 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, స్కేళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు దుర్గారావు, కోటగిరి సీతారామ స్వామి, శీమకుర్తి వెంకటేశ్వరరావు, మోహన్‌రావు, మురళీ, ఇనుగంటి ప్రవీణ్ పాల్గొన్నారు.

25 బారికేడ్లు..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు మహా సిమెంట్ సంస్థ వారు బారికేడ్లను మంగళవారం విరాళంగా అందజేశారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ కోసం మొత్తం 25 బారికేడ్లను ట్రాఫిక్ ఎస్‌ఐ మధు ప్రసాద్‌కు అప్పగించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నేలవెల్లి కరుణాకర్ రావు, నారాయణం, సునీల్, శ్రీనివాస్ రావు, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత



మృతుడి తండ్రికి చెక్కు అందజేస్తున్న 108 స్టేట్ హెడ్ (ఆపరేషన్స్) ఎంఏ ఖాలీద్

కరకగూడెం: మండల 108 అంబులెన్స్‌లో ఈఎంటీగా విధులు నిర్వహిస్తూ గతేడాది చిరుమళ్ల గ్రామానికి చెందిన దోమల ప్రణయ్ మృతి చెందగా.. తెలంగాణ 108 స్టేట్ హెడ్ (ఆపరేషన్స్) ఎంఏ ఖాలీద్ మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంస్థ ముఖ్య కార్యాలయంలో ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ నుంచి మృతుడి తండ్రికి 5 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో భాగంగా ఏ ఉద్యోగస్తుడైన ప్రాణాలు కోల్పోతే వారికి బీమా వర్తిస్తుందని తెలిపారు. అనంతరం కంపెనీ వారికి మృతుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఆర్ హెడ్ కిరణ్ కిషోర్, 108 పైలెట్ సాయి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ మంజూరుకు వినతి

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలో కమ్యూనిటీ హాల్‌తోపాటు ఖబరస్తాన్‌కు ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా స్థానిక మసీద్ కమిటీ బాధ్యులు ఎమ్మెల్యేను కోరారు. మంగళవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణను గండుగులపల్లిలో వారు కలిసి వినతి చేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. కమ్యూనిటీ హాల్ ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా అధికారులకు ఆదేశించినట్లు మసీద్ కమిటీ అధ్యక్షుడు యండి.షమీహుసేన్ తెలిపారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో ఎస్‌కె.యాకూబ్‌అలీ, యండి.ఇమ్రాన్, ఎస్‌కె.వసీం, ఎండి.షాకీర్, భోలే తదితరులు ఉన్నారు.

పైలట్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుల పర్యటన

మణుగూరురూరల్: ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కుర్రి నాగేశ్వరరావు, కుంటా లక్ష్మణ్‌లు ఆరోపించారు. మంగళవారం మండల పరిధిలోని లంక మల్లారం గ్రామపంచాయతీలో నాయకులు పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం లంకమల్లారం గ్రామపంచాయతీని పైలట్ గ్రామంగా ప్రకటించినప్పటికీ ఎటువంటి అభివృద్ధినీ చేయలేదని విమర్శించారు. కనీసం గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు వంటివి కూడా అమలు కావడం లేదన్నారు. నాయకులు తాళ్లపల్లి యాదగిరిగౌడ్, ముద్దంగుల కృష్ణ, ఆవుల నర్సింహారావు, దర్శినాల శ్రీనివాస్, కాటిబోయిన సుజాత, ఏనిక ప్రసాద్, వల్లభనేని రమణ, రాంబాబు, సురేష్, రామకోటి, రామారావు, రమేష్ పాల్గొన్నారు.

ఆయిల్‌ఫెడ్ డీఓకు వినతి



డీఓకు వినతి పత్రం అందిస్తున్న రైతులు, సంఘం బాధ్యులు

అశ్వారావుపేటరూరల్: నకిలీ, ఆఫ్‌టైప్ పామాయిల్ మొక్కలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆయిల్‌ఫెడ్ డీఓ నాయుడు రాధాకృష్ణను అశ్వారావుపేట జోన్ ఆయిల్‌పామ్ రైతు సంఘం బాధ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం మండల పరిధిలోని నారంవారిగూడెం వద్దగల ఆయిల్ ఫెడ్ డివిజనల్ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పామాయిల్ తోటల్లో 50 శాతం నకిలీ, ఆఫ్‌టైప్ మొక్కలు ఉండటంతో నష్టపోతున్నట్లు వివరించారు. తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. బాధిత రైతులు సంకా నాగబాబు, కుంచం సుబ్బారావు, నున్నా కృష్ణ, చెలికాని సూరిబాబు, వెంకట్రావ్, దొడ్డా చక్రధర్ రెడ్డితోపాటు సంఘం బాధ్యులు కె.పుల్లయ్య, వెంకట్, చెన్నారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

జి. శ్రీనివాస్, ACM - 70754 60585 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గాంప్రసాద్-9000327175. టోల్‌ఫ్రీ నెం.:1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
ఎన్. జయరాజు - 9652868642
కె. మధు - 97059 44416